పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూ॥ గోదావరి । ప॥ గోదావరి । ఏలూరు



# డ్రోన్ సాంకేతికతతో సాగు

## రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ శాఖ



**కాజులూరు, పెన్ పవర్,జూలై 22:** మండల పరిధిలోని తర్లంపూడి గ్రామంలో మంగళవారం "పొలం పిలుస్తుంది" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వి.అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ .విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత అనుసరణతో రైతులు డ్రోన్ల వినియోగంపై దృష్టి సారించాలని కోరారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నానో ఎరువులు, పురుగు మందులను పిచికారీ చేయగలిగే సామర్థ్యం డ్రోన్లకు ఉందని వివరించారు. ఇది సమయాన్ని, ఖర్చులను ఆదా చేయడమే కాక, రసాయనాల వినియోగాన్ని సుమారు 25 శాతం వరకు తగ్గిస్తుందని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో డ్రోన్లను అందుబాటులోకి తెచ్చిన నేపథ్యంలో, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం డ్రోన్ ద్వారా వరి పొలంలో నానో యూరియా ఎరువు పిచికారీ చేసి రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో కరప సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాబురావు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస వర్మ, తర్లంపూడి సర్పంచ్ నరాల బాలరాజు, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి సింహాద్రి, సొసైటీ ప్రెసిడెంట్ కొండమూరి సత్యనారా యణ, అలాగే గ్రామ ప్రముఖులు కొండమూరి రమేష్ కుమార్, పెంకే అప్పారావు, కొండమూరి నరేశ్, భద్రరావు తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రయోజనాలు తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

# ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అమలే కూటమి లక్ష్యం

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజల్లోకి నేరుగా వెళ్లిన నాయకులు

**కాకినాడ, జూలై 22, 2025:** "ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల అమలు చేసి ఆర్థికంగా ముందుకు నడిపించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం," అని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు స్పష్టం చేశారు. మంగళవారం 4వ డివిజన్ పరిధిలో జరిగిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొండబాబు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి, కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చుతూ న్యాయమైన పాలనను ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు.

**అమలవుతున్న ముఖ్యమైన పథకాలు:**

- తల్లికి వందనం
- ఎన్టీఆర్ భరోసా పథకం: వృద్ధులు,వితంతువులకు రూ4,000
- దివ్యాంగులకు రూ.6,000
- పూర్తివైకల్యం ఉన్నవారికి రూ.15,000
- దీపం పథకం ద్వారా- ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఈ పథకాలు పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కొండబాబు అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంక్షేమం, పారదర్శకత, బాధ్యతగల పాలనే కేంద్రబిందువుగా వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వడిసెల దాలమ్మ, మల్లి పూడి కుమార్,గంజాం నమశ్శివాయ, పోతుల శ్రీనివాసరావు, దిలీప్ కుమార్ సదనాని, ఆడదా సత్య శ్రీనివాస్, ఆలమూరి మురళీకృష్ణ, వానపల్లి పోలీస్, మాదారపు శ్రీనివాసరావు, కెంగం హరి రామ ప్రసాద్, రాజు పరిమళ, వడిసెల వెంకటరమణ, మాదారపు లక్ష్మీనారాయణ, వనమిశెట్టి సుబ్బారావు, కంది శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ జూలై 22:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి,పాడి పశువుల సంతతి మెరుగుదలకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా పశుసంవర్ధక శాఖ, పశు వైద్యాధికారులతో సమావే శం నిర్వహించి జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పశువుల సంఖ్యను పెంచడానికి గల సాధ్య సాధ్యాలపై పశువైద్యా ధికారులతో అనుభవ పూర్వకమైన సూచనలను కోరుతూ ఆచరణ గల అవకాశాలపై సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వుల పెంపకంపై ముందుగా దృష్టి సారిస్తూ స్థానికంగా ఉన్న పశువుల పోషకాహార స్థితులను మెరుగు పరుస్తూ పాల దిగుబడిని పెంచాలని సూచించారు.

6 లో

## కాకినాడ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ, హాకీ టోర్నమెంట్ కోసం

# రూ.11.30 లక్షల విరాళాలు

### ప్రైవేటు సంస్థల స్పందన పట్ల కలెక్టర్ షణ్మోహన్ కృతజ్ఞతలు





**కాకినాడ, పెన్ పవర్,జూలై 22:** కాకినాడలో వచ్చే నెలలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ మరియు హాకీ టోర్నమెంట్ నిర్వహణ కోసం మంగళవారం జిల్లాలోని వివిధ ప్రైవేటు సంస్థలు, విద్యా సంస్థలు, వాణిజ్య సమాఖ్యల నుండి మొత్తం రూ.11 లక్షల 30 వేల విరాళం అందినట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. విరాళంగా అందిన మొత్తాన్ని కలెక్టర్ కార్యాలయంలో ఆయా సంస్థల ప్రతినిధులు చెక్కుల రూపంలో కలెక్టర్ గారికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, "జాతీయ స్థాయి కార్యక్రమాల నిర్వహణకు జిల్లాలోని సంస్థలు కనబరిచిన సహకారం ప్రశంసనీయమైనది. యువత భవిష్యత్‌ను నిర్మించే మార్గంలో ఈ కార్యక్రమాలు ఎంతో ముఖ్యమైనవిగా నిలవబోతున్నాయి," అని తెలిపారు.

**విరాళాలు అందించిన సంస్థలు వివరాలు ఇలా ఉన్నాయి**

- కాకినాడ ఎస్సార్ఎంటి: రూ.5,00,000
- దేవి ఫిష్ రిష్: రూ.1,00,000
- శ్రీ చైతన్య స్కూల్: రూ.50,000
- శ్రీ చైతన్య జూనియర్ కళాశాల: రూ.50,000
- భాష్యం స్కూల్: రూ.50,000
- క్రైట్ కళాశాల: రూ.1,00,000
- కాకినాడ రిటైల్ కిరాణా మర్చంట్ అసోసియేషన్: రూ.30,000
- ఏఎల్ఎస్ఎంఐ ఎక్స్పోర్ట్: రూ.50,000
- వనపర్తి రీజియన్ పౌల్ట్రీ ఫార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ: రూ.1,00,000
- బీఎస్. సీతాపతిరావు: రూ.1,00,000

ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా సంస్థల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. వారి సహకారం జిల్లా యువతకు ఉత్తేజాన్నిచ్చే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు దోహదపడుతుందని చెప్పారు.





# శిథిలావస్థకు చేరుకున్న ఎటపాక పాలిటెక్నిక్ కళాశాల

## భవనం పాతబడి బలహీనంగా మారి ప్రమాదకరంగా ఉంది

- భవనం గోడలకు మర్రి చెట్లు నాటినట్లు ఉన్నాయి
- భవనం కిటికీలు దర్వాజాలు విరిగిపోయాయి
- వర్షం పడితే ప్రమాదకరంగా మారి అవకాశం
- భయం గుప్పెట్లో విద్యార్థులు అధ్యాపకులు..అధికారుల అలసత్వం

**ఎటపాక పెన్ పవర్ జూలై 21:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ, సమీకృత గిరిజన సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో 1990వ సంవత్సరం ఏప్రిల్ 4వ తేదీన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి. చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ భవనం 2025 నాటికి 35 సంవత్సరాలును పూర్తి చేసుకున్న సంగతి తెలిసినదే... ఆంధ్ర తెలంగాణ విడిపోయిన నాటి నుంచి ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల ఏపీలోనే కొనసాగుతూనే ఉంది, ఈ పాలిటెక్నిక్ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులు ఇంజనీ ర్లుగా ఉన్నతమైన శిఖరాలను అందుకొని ఉన్నతమైన ఉద్యోగాలలో కొనసాగుతున్నారు, ఈ కళాశాలలో ఒకప్పుడు అడ్మిషన్ రావాలంటే ప్రతిభావంతులైన విద్యార్థులకు తప్ప వేరే వారికి సీటు వచ్చేది కాదని, అదే పాలిటెక్నిక్ కళాశాల ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది,కళాశాల భవనం, హాస్టల్ బ్లాక్ శిథిలావస్థకు చేరుకోవడంతో దీనివల్ల విద్యార్థులు అధ్యాపకులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,

గోడలు పగిలిపోయి ఎక్కడికక్కడ నేర్రలు పడ్డాయి, వర్షాకాలం వచ్చిందంటే స్లాబ్ పూర్తిగా తడిసిపోయి, పై కప్పు నుంచి వరుసకు చినుకులు కారుతాయి, గోడలు పగిలిన పగుళ్ల నుంచి వర్షపు నీరు రావడం జరుగుతుంది, గోడలు వర్షానికి తడిచి పాచి పట్టి పచ్చగా కనిపిస్తాయి, భవనానికి ఉన్న గోడలు పగిలిన నర్రెల నుంచి మర్రి చెట్లు, ఆకు తీగలు పెరిగి భవనాన్ని పూర్తిగా శిథిలావస్థకు చేర్చాయి, పాతబడిన భవనం బలహీన పడిపోయి ఎప్పుడు పడిపోతుందో అనే భయంతో విద్యార్థుల అధ్యాపకులు ఆందోళన చెందుతు న్నారు, ఆ కళాశాల రోడ్డుకు ప్రక్కనే ఉండటంతో అటుగా అనేకసార్లు అధికారులు ప్రజా ప్రతినిధులు వెళుతున్నారే తప్ప ఆ భవనానికి శాశ్వతమైన పరిష్కారాన్ని చూపు లేకపోతు న్నారు, ఈ కళాశాలకి ఎన్నో మారుమూల జిల్లాల నుంచి మారుమూల గ్రామాల నుంచి ఉన్నత చదువుల నిమిత్తం వచ్చి చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదం డ్రులు భవనం పరిస్థితి చూసి విద్యార్థులను కాలేజీలో చేర్పించడానికి ఇష్టపడడం లేదని తెలుస్తుంది, అందువలనే పాలిటెక్నిక్ కాలేజీకి అడ్మిషన్స్ తక్కువైతున్నాయి అని చెప్పగానే చెప్పవచ్చు, ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు చొరవ తీసుకుని శీథిలావస్థకు చేరుకున్న భవనాన్ని మరమ్మత్తులు చేయించి కాలేజీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరుకుంటున్నారు,








## వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశిష్ట పూజలు

### గోదావరి డేటా చీఫ్ ఇంజనీర్ కె. శేషుబాబు





**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 22:** వాడపల్లి శ్రీ వెంకటేశ్వగోదావరి డేటా చీఫ్ ఇంజనీర్ కె. శేషుబాబుర స్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో విశిష్ట పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు స్వామివారికి అద్భుతంగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అమ్మవారి వసంత మండపంలో ఏడు వారాలు పూర్తిచేసుకున్న అనంతరం అష్టోత్తర నామార్చన పూజను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయంలో నూతన నిర్మాణంలో ఉన్న శ్రీ వకుళమాత అన్నదాన భవనానికి విరాళాలు అందిస్తూ భక్తులు తమ శ్రద్ధాభక్తులు చాటుకున్నారు. రావులపాలెం మండలం, కొమ్మరాజులంక గ్రామానికి చెందిన కర్రీ వెంకటరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు రూ. 25,116 విరాళంగా అందించగా, రాజోలు మండలం, పోదలాడకు చెందిన పల్లపోతు నాగేశ్వరరావు %-% కళావతి దంపతులు రూ. 25,016 విరాళం సమర్పించారు. వీరిని ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వాధనం చేయగా ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం బహుకరించారు. జి.ఆర్.ఎం.బి. మెంబర్ సెక్రటరీ ఆర్.కె. కనోడియా, గోదావరి డేటా చీఫ్ ఇంజనీర్ కె. శేషుబాబు స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగిపోవడం భక్తులకు అనందాన్ని కలిగించింది. ఆలయ నిర్వాహకులు భక్తులకు నిత్యం విశేష సేవలందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చాటుకుంటున్నారు.





## ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం పెన్ పవర్ జూలై 22:** రావులపాలెం మండలంలోని ఈతకోట గ్రామం మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని సందర్శించిన కొత్తపేట శాసనసభ్యుడు బండారు సత్యానందరావు, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న కూటమి పాలన వెనుక ఉన్న సంకల్పాన్ని ప్రతిఫలింపజేశారు. ఎమ్మెల్యే బండారు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ముచ్చటించారు. గత ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వారికి వివరించారు. ముఖ్యంగా వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి కార్యక్రమాలు ప్రజల హృదయాలను గెలుచుకున్నాయని చెప్పారు. ప్రతి పేద ఇంట్లో వెలుగు వెలగాలి. సంక్షేమమే మా మార్గదర్శకం," అని ఆయన నిగ్గ చెప్పారు. త్వరలో అమలు కానున్న అన్నదాత సుఖీభవ, మహిళల ఉచిత బస్సు ప్రయాణం పథకాల గురించి కూడా వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడంలో ప్రభుత్వం విజయవంతమైందని, ఇందువల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.తర్వాత గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, విద్యార్థులతో కలసి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల మిత్ర కిట్‌లపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఆనందంగా చదువుతుండటం చూసి ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే పొలం పిలుస్తోంది

### -మండల ఏఓ పి రాజేశ్వరి

గోకవరం:వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి పి రాజేశ్వరి అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురం గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తూ పకృతి వ్యవసాయం ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతులు, సమగ్ర ఎరువుల,పురుగుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ అధికారులు తెలిపారు. రసాయనాలు,పురుగుల మందులు వినియోగం తగ్గించాలని వ్యవసాయ అధికారులు సూచించిన మోతాదులోనే పంటలకు రసాయన ఎరువులు వాడాలని తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గుతుందని మట్టి నాణ్యత పెరుగుతుందని తెలిపారు. సాగు ఖర్చులు తగ్గించి నాణ్యమైన దిగుబడిని పెంచడమే లక్ష్యంగా పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుల సందేహాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ యంత్రాలు పనిముట్లు పంపిణీ చేసేందుకు




ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి పి.రిని,గవర్నమెంట్ హాస్పటల్ డైరెక్టర్ పిట్ట అరుణ్, ఆకుల కాశి,పంచాయతీ కార్యదర్శి ప్రణవ్, గ్రామ రెవెన్యూ అధికారి బత్తుల దివాకర్ బాబు,వెటర్నరీ అసిస్టెంట్ చినబాబు,గ్రామ వ్యవసాయ సహాయకురాలు భాగ్య, గ్రామ రైతులు జుత్తుక నాగేశ్వరరావు, బండారు కృష్ణ, పెరుగు రాంబాబు,గంగిశెట్టి సత్యనారాయణ,బత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదరికం లేని సమాజం చేయడమే పి4 సర్వే లక్ష్యం



**సీతానగరం, పెన్ పవర్, జూలై22:** పేదరికం లేని సమాజమును తయారుచేయడమే పి ఫోర్ సర్వే యొక్క లక్ష్యము అని టిడిపి సీనియర్ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి (నళిని) అన్నారు, ఈ సందర్భంగా పి4 తొలి విడతలో భాగంగా సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన చెరుకూరి గణేష్ యానాదుల కుటుంబాన్ని దత్తతు తీసుకున్నారు, ఈ సందర్భంగా గద్దె వెంకటకృష్ణ చౌదరి మాట్లాడుతూఇంటింటికి తిరిగి చేసిన సర్వే నిర్వహణలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని,పేదవారిని ఆర్థిక సామాజిక రంగాల్లో తీసుకొచ్చే విధంగాపేదలను ధనికులను భాగస్వామ్యం చేసేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుం దని తెలిపారు.ప్రజల భాగస్వామ్యం) లక్ష్యం మేరకు గ్రామాలలో బాగా వెనుక బడిన వారి గుర్తించి వారి అభ్యున్నతికి అభివృద్ధి చెందిన వారి ద్వారా సహకారం అందించి లబ్ది చేకూరే పనులు చేపట్టడంలో ప్రజాభిప్రాయ సేకరణలో అందురూ పాలుపంచుకో వాలని మెజారిటి అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలపడం జరుగుతుందన్నారు. అట్టడుగు కుటుంబాల వివరాలు తీసుకొని ఉన్నతంగా స్థిరపడిన వారి సహకారంతో వారి ఉన్నతికి చేయూతనివ్వడంజరుగ ుతుందన్నారు ఈ కార్యక్రమంలో గద్దె జ్ఞానేంద్ర ప్రసాద్, గద్దె నాని, సీతానగరం మండలం కల్చర్ అధ్యక్షుడు సింహాద్రి బుల్లి వీర్రాజు చౌదరి, గ్రామసర్పంచ్ కొంచఅన్నపూర్ణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు,

## ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలి

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 22:** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం జగ్గంపేట మండలం మల్లిశాల, కాండ్రేగుల గ్రామాలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి ఒక్క రైతు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. అలాగే ప్రతి కౌలు రైతు కూడా తప్పనిసరిగా కౌలు కార్డులు తీసికోవాలని సూచించారు. దమ్ములో వేసుకోవలసిన ఎరువుల గురించి రైతులకు వివరించారు. రైతులకు గట్ల మీద వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి శ్రీ వల్లి, క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు, మల్లిశాల సర్పంచ్, సర్వసిద్ధి లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుమ్మల అనంతలక్ష్మి, సియాదుల పెద్దకాపు, వ్యవసాయ శాఖ గ్రామాధికారులు, మల్లిసాల, కాండ్రేగుల గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## రేపటినుండి ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రం

**గోకవరం, పెన్ పవర్, జూలై 22 :** ఈనెల 23 వ తేదీ నుండి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 'రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రం' లో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. తిరన్ తెలిపారు. ఆరోగ్య సిబ్బంది స్కూళ్ళల్లో విద్యార్థినీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఈ స్క్రీనింగ్ నందు అనారోగ్య సమస్యలు ఉన్నట్లయితే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి నందు డైస్ సెంటర్ నందు చికిత్స అందిస్తారని తెలిపారు. అతి త్వరలో వీరికోసం ఒక వాహనాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు డా.తిరన్ తెలిపారు. ప్రతీ ప్రభుత్వ స్కూల్ లోని విద్యార్థులు వారికి ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా ఆరోగ్య సిబ్బందికి తెలియజేయాలని స్కూల్ యాజమాన్యం వారు ఈ కార్యక్రమాకు సహకరి%శీ%చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.



# ధూప దీప నైవేద్య పథకం

## పలు ఆలయాలకు నిధుల మంజూరు





**కొత్తపేట, పెన్ పవర్, జూలై22బీ** కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు నిరంతర ప్రయత్నాల ఫలితంగా నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం క్రింద దేవాదాయ శాఖ నిధులను మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా తక్కువ ఆదాయంతో నడుస్తున్న ఆలయాలలో రోజూ ధూప దీప నైవేద్య కార్యక్రమాలు కొనసాగేందుకు, ఆలయ అర్చకులకు ఆర్థిక సాయంగా నెలకు 10వేల రూపాయలు చొప్పున నిధులు అందించనున్నారు. ఈ దఫా కొత్తపేట మండలంలోని ఆరు ఆలయాలకు నిధులు మంజూరయ్యాయి:

1. వాడపాలెం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం
2. కమ్మిరెడ్డిపాలెం శ్రీ తాళ్ళమ్మ అమ్మవారి ఆలయం
3. కమ్మిరెడ్డిపాలెం శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయం
4. వానపల్లి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం
5. వానపల్లి శ్రీ బాల బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయం
6. కొప్పిశెట్టివారివీది బంగారమ్మ అమ్మవారి ఆలయం..ఇవే కాకుండా, మిగిలిన ఆలయాలకు కూడా త్వరలో మరో విడతలో ఆర్థిక సహాయం అందించనున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారు మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## శాకంబరిగా కొత్తూరు శ్రీ కనకదుర్గమ్మ.



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 22:** కొత్తూరు సెంటర్‌లో చింతలూరు కాలువ పక్కన వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారు మంగళవారం శాకంబరీ అవతారంలో దర్శనమిచ్చారు. ఆషాఢ మాసంలో అమ్మవార్లను శాకంబరిగా అలంకరించి, పూజిస్తే వర్షాలు బాగా పడి కరువుకాటకాలు లేకుండా ప్రజలు సుభిక్షంగా ఉంటారని అర్చకులు హనుమాన్ ఈ సందర్భంగా తెలిపారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో కనకదుర్గమ్మవారికి చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శెట్టి నాగేశ్వరరావు



**మండపేట. పెన్ పవర్.జూలై 22 :** వైసీపీ సీనియర్ నాయకుడు, మండపేట నియోజకవర్గ ఎలక్ట్రీషియన్ యూనియన్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు ఆ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ తోట ఆయన మెడలో పూలమాల వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీకి ప్రతిష్టను పెంచాలని త్రిమూర్తులు సూచించారు. తనపై ఎంతో నమ్మకంతో కార్మిక విభాగంలో రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అప్పగించినందుకు శెట్టి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని కార్మికులకు అండగా ఉంటూ రాబోయే రోజుల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ యూనియన్ వర్కర్స్ సత్తింశెట్టి ధనరాజు, కాళ్ల సత్తిబాబు, గుండు మరళీ, పిచ్చుకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం పెన్ పవర్ జూలై 22:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధికి,పాడి పశువుల సంతతి మెరుగుదలకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు.మంగళవారం స్థాని కలెక్టరేట్ నందు జిల్లా పశుసంవర్ధక శాఖ, పశు వైద్యాధికారులతో సమావేశం నిర్వహించి జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధి పశువుల సంఖ్యను పెంచడానికి గల సాధ్య సాద్యాలపై పశువైద్యాధికారులతో అనుభవ పూర్వకమైన సూచనలను కోరుతూ ఆచరణ గల అవకాశాలపై సంప్రదింపులు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకంపై ముందుగా దృష్టి సారిస్తూ స్థానికంగా ఉన్న పశువుల పోషకాహార స్థితులను మెరుగు పరుస్తూ పాల దిగుబడిని పెంచాలని సూచించారు.అందుకు అవసరమైన పశు దాన పైలట్ ప్రాజెక్టులను రావులపాలెం, రామ చంద్రపురంలో ఏర్పాటుకు డ్వాక్రా సంఘాల సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పశువుల దానా యూనిట్ ప్రస్తుతం నడుస్తున్న కృష్ణాజిల్లా వీర వల్లి గ్రామానికి పశు వైద్యా ధికారుల బృందం వెళ్లి సందర్శించి యూనిట్ స్థాపనకై డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ రూపొందించాలని ఆదేశించారు. బేసిక్ మిష నరీ ముడి సరుకు లభ్యత, ముడిసరుకు రవాణా రైతులకు తక్కువ ధరకే అందుబాటు, జిల్లాలో ఉన్న పశువుల సంఖ్య, విక్రయాలు డిమాండ్ సప్లై లపై అధ్యయనం చేస్తూ యూనిట్ నెలకొల్పడానికి ముడి సరుకు జొన్నలు వేరు శనగ నువ్వుల కేకులు సప్ల మెంట్స్ వరి ఉత్పత్తులు వంటి అంశాలతో కూడిన నివేదికను కూడా రూపొందించాలన్నారు.పాడి రైతులతో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించి పశుదాన ఉత్పత్తుల తయారీ ధరలు సరఫరా వంటి అంశాలను వివరించాలన్నారు. పశు వైద్యాధికారులు సలహాలు ఇస్తూ పుట్టిన లేగ దూడ వయస్సు 18 నెలలు వచ్చిన సందర్భంలోనే ఎదకు వచ్చి పాడి పరిశ్రమకు ఎంతో ఉపయు క్తంగా ఉండే సునందిని కార్యక్రమం విధానాన్ని మరల పునరు ద్ధరిస్తే బాగుంటుందని, పశువుల దాన, మల్టీ విటమిన్, అజోలా గడ్డి, కాల్షియం, మినరల్స్, తదితర పశువుల పోషక వస్తువులను రేషన్ షాపులు మాదిరిగా రాయితీపై రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తే పాడి పరిశ్రమ అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని,మేలు జాతి పాడి పశువులు కొనుగోలుకు రాయితీలతో బ్యాంకు రుణాలను అందిస్తే పరిశ్రమ అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని వారు తెలిపారు. నూతనంగా ప్రతిపాదించిన దాన యూనిట్ మూలంగా కూడా పాల దిగుబడిని పెంచేందుకు అవకా శాలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు, సహాయ సంచాలకులు ఉమా మహేశ్వర్ రెడ్డి,పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేసిన పార్టీ టీడీపీ

**మండపేట. పెన్ పవర్.జూలై 22:** దేశంలో సంక్షేమ పథకాలకు అంకురార్పణ చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట మండలం, మారేడుబాక గ్రామంలో మంగళవారం సుపరిపాలన తొలి అడుగు కార్యాక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ పర్యటించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలందరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ఏడాది పాలన పట్ల జనామోదం లభించిందని తెలిపారు. మున్ముందు మరిన్ని ప్రజలకు ఆమోదయోగ్యమైన సంక్షేమ పథకాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లపై ప్రజల్లో చైతన్యం

## లబ్బర్తి గ్రామంలో పోలీసుల అవగాహన కార్యక్రమం



**రాజవొమ్మంగి, పెన్ పవర్, జూలై 22:** ఏజెన్సీ ప్రాంతమైన రాజవొమ్మంగి మండలం లబ్బర్తి గ్రామంలో చెడు అలవాట్లపై ప్రజల్లో హెచ్చరికతో కూడిన చైతన్యం కల్పించేందుకు పోలీసు శాఖ తరఫున అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం రాజవొమ్మంగి ఎస్సై నరసింహమూర్తి నేతృత్వంలో జూలై 22న సాగింది. గ్రామస్తులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎస్సై నరసింహమూర్తి, మద్యం, పొగాకు, మానసికంగా దెబ్బతీసే ఇతర వ్యసనాల వల్ల కుటుంబ జీవితం కలుషితమవుతోందని వివరించారు. యువత చెడు సహవాసాలను దూరంగా పెట్టుకుని చదువు, జీవనోపాధిపై దృష్టిపెట్టాలని సూచించారు. వెల్లడించిన ప్రకారం, గ్రామాల్లో అసాంఘిక ప్రవృత్తులపై నిత్యం గమనింపు కొనసాగుతోంది. శాంతిభద్రతలపై విఘాతం కలిగించేందుకు యత్నించేవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో మంచి విలువల పునర్నిర్మాణం సాధ్యమవుతుందన్న నమ్మకంతో, ప్రజా భాగస్వామ్యాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యాలయాల్లో తప్పనిసరిగా జాతీయ గీతం పాడించాలి

### బీజేపీ నేత కోన

**మండపేట. పెన్ పవర్.జూలై 22 :** విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ జాతీయ గీతాలు తప్పనిసరిగా పాడేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఉదయం వందేమాతరం, ప్రతిజ్ఞ, సాయంత్రం జనగణమన ఆలపించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు పంచాయితీ సభ్యులు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు చొరవ చూపాలని కోరారు. గీతాలాపన వీడియోలను అధికారికంగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. గతంలో ప్రతి పాఠశాలకూ ఆటస్థలాలు ఉండేవని ఉపాధ్యాయులే విద్యార్థులతో జాతీయ గీతం పాడించే వారన్నారు. కానీ ప్రస్తుతం అలాంటి దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు తగ్గిపోతున్నాయంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థల్లో దేశభక్తి గీతాలాపనను తప్పనిసరి చేయాలని కోన సత్యనారాయణ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## ప్రజా ప్రతినిధుల అవమానానికి అధికారుల దుష్ప్రవర్తన



**రాజవొమ్మంగి , పెన్ పవర్ జూలై 21:** జడ్డంగి గ్రామంలోని సొసైటీ గోదాంను జూలై 21న శాసన సభ్యురాలు శిరీష దేవి ప్రారంభించిన సందర్భంగా, స్థానిక ప్రజా ప్రతినిధులను అధికారులు కావాలనే పక్కన పెట్టారని తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఈ సందర్భంగా జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ మాట్లాడుతూ– "ప్రజల చేత ఎన్నుకోబడిన మమ్మల్ని నిర్వాహకులు ఆహ్వానించకపోవడం ఎంతో బాధాకరం. కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడం అనైతికం. ఇదివరకు జడ్డంగి చిన్నయ్యపాలెం రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా ట్రైబల్ సంక్షేమ శాఖ అధికారులు కూడా మాతో అలాంటి వంచనే చేశారు. ఇప్పుడు సొసైటీ గోదాం ప్రారంభోత్సవానికి మళ్లీ మాకే కాకుండా ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు వడుగుల జ్యోతిలకు కూడా సమాచారం ఇవ్వలేదు. ఇది ప్రజాప్రతినిధులను అవమానించడమే" అని తెలిపారు.ఎంపీటీసీ సభ్యురాలు కనేం అచ్చియ్యమ్మ కూడా స్పందిస్తూ.. "ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను పిలవకుండా, గౌరవించకపోవడం భావపూర్వకమైన అవమానమే. ఇది అనేకవేళ్లుగా జరుగుతూనే ఉంది. ఇకపై మౌనంగా ఉండేది లేదు. సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో వద్ద ఫిర్యాదు చేస్తాం" అని హెచ్చరించారు.ప్రజల చేత ఎన్నుకోబడ్డ నాయకులను అణచివేయాలని చూస్తే, ప్రజలే ఎదురు నిలుస్తారని వారు స్పష్టం చేశారు.

## ముద్రగడ ఆరోగ్యం బాగు పడాలని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 22:** ఇటీవల వైయస్సార్ సిపి రాష్ట్ర పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకువెళ్లారు. ఈ మేరకు వైయస్సార్సిపి శ్రేణులు ఏలేశ్వరం పాత బస్టాండ్ వద్ద గల శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనారోగ్యంతో హైదరాబాద్ వెళ్లిన ముద్రగడ తిరిగి ఆరోగ్యంతో ఇంటికి రావాలని ప్రార్థనలు జరిపారు. ఆలయ అర్చకుడు మహేష్ సమక్షంలో శ్రీ లక్ష్మీ గణపతికి 12వ వార్డ్ కౌన్సిలర్ సామంతుల సూర్య కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ ఏ ఎం సి డైరెక్టర్ పైల విజయ్ , కో ఆప్షన్ సభ్యులు వాగు బలరాం , మాజీ కౌన్సిలర్ వాడపల్లి శ్రీను,కావలి శ్రీను , వైఎస్ఆర్సిపి శ్రేణులు, ముద్రగడ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పణ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 22:** మండలంలో జె.కొత్తూరు గ్రామంలో గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారు ఆషాడమాసం సందర్భంగా మంగళవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న మహిళలు నెత్తిన కలశాలు పెట్టుకుని గ్రామంలో తిరిగి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 22:** జగ్గంపేట శివారు గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. మహిళలు అంతా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని దాని వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. అలాగే ర్యాగింగ్ చట్టంపై విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో రక్షణ పరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే తమను నేరుగా సంప్రదించవచ్చని నెంబర్లు ఇచ్చారు. విద్యార్థులకు పూర్తి రక్షణగా తాము అందుబాటులో ఉంటామని సీఐ వైఆర్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యను అభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జివి లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ బివిసి కుమారి, ఉపాధ్యాయులు రజిని, అమృతవల్లి, ఉషారాణి, సత్యవతి తులసి, సూర్యావతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



## అస్వస్థతకు గురైన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే ముప్పిడి

**కొవ్వూరు, పెన్ పవర్, జులై 22:** మండలంలోని మలకపల్లి గ్రామంలో నలుగురు వ్యవసాయ కూలీలు పంట పొలాల్లో పురుగుల మందులు వేసే సమయంలో మందు పవర్ ఎక్కువయ్యి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే వారిని చికిత్స కొరకు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేయడం జరిగింది. మంగళవారం వారిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆసుపత్రిలో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కొవ్వూరు నియోజకవర్గ టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మలకపల్లి గ్రామ ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయంపై దాడి మహిళ అరెస్ట్




**రాజవొమ్మంగి పెన్ పవర్ జూలై 22:** ఒక్కదుర్తి గ్రామ శివారులో నాటు సారాను అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్నట్టు ఖచ్చిత సమాచారం అందడంతో జడ్డంగి పోలీసు స్టేషను పరిధిలోని ఎస్సై చిన్నబాబు నేతృత్వంలో ఈ రోజు ఉదయం దాడి నిర్వహించారు. ఈ దాడిలో ఒక మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుండి పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.ఎస్సై చిన్నబాబు మాట్లాడుతూ %–% "నాటు సారా మానవ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. శరీరానికి ముప్పు తెచ్చే విషపదార్థాలు కలిగిన ఈ మద్యం తాగడం వల్ల లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు రావడమే కాక, ప్రాణాలకూ ప్రమాదం ఏర్పడుతుంది. ఆర్థికంగా, సామాజికంగా కూడా కుటుంబాలను ధ్వంసం చేసే పరిస్థితులు నెలకొంటాయి" అని అన్నారు.అక్రమ మద్యం తయారీ, విక్రయాలు చేసి గ్రామీణ జీవితాన్ని విషమంగా మారుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. నాటు సారా తాగకుండా, దాన్ని తయారు చేయకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని ఎస్సై చిన్నబాబు హెచ్చరించారు.

# నిర్వాసితుల సమస్యలపై వినతి పత్రం అందజేత

### -వై.యస్.ఆర్ సి.పి.మండల కమిటీ నాయకులు



**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.22:** పోలవరం ప్రాజెక్టు కారణంగా సర్వం కోల్పోతున్న నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వై.యస్.ఆర్ సి.పి.మండల కమిటీ నాయకులు చింతూరు ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్,కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అంద జేశారు.పోలవరం ప్రాజెక్టు కారణంగా మండలంలో ముంపుకు గురి అవుతున్న గిరిజనులకు,గిరిజనేతరులకు పునరావాసం గోకవరం,కొత్తపల్లి,కోరుకొండ,జగన్నాధపురం తదితర గ్రామాల్లో ఉన్న భూములను ప్రభుత్వం సేకరించి, పునరావాసం కల్పించాలని,గిరిజనులకు కూడా రాజవొ మ్మంగి మండలం గిడ్డంగి,తాడికొండ,గ్రామాల్లో ఉన్న భూములు అనుకూలంగా ఉన్నాయని,ప్రభుత్వం వారు ఆ భూములను సేకరించి నిర్వాసితులకు కాలనీల గృహాల నిర్మాణాలు చేపట్టాలని,లేనియెడల తాడ్వాయిలో భూములు,గృహాల నిర్మాణంకు స్థలాలు ఇవ్వాలని. 1.వి.ఆర్.పురం బి.సి.కాలనీ గ్రామంలోని గృహాలను సర్వే చేసి యున్నారు.గృహాల విలువ పత్రాలు ఇప్పించాలని, ప్యాకేజీ కూడా అందించాలని, 2.వి.ఆర్.పురంగ్రామానికి చెందిన కొంతమంది నిర్వాసితులకు గృహాల విలువ పత్రాలు అందలేదు. వాటిని కూడా అందించాలని,3.వి.ఆర్.పురం రాజీవ్, గాంధీ జంక్షన్,లో ఉన్న నిర్వాసితుల గృహాల విలువ పత్రాలు నిలుపుదల చేశారు.ఆ సమస్య కూడా త్వరగా పరిష్కరించాలని,4.పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కొంతమందిని ధళారులు మభ్యపెట్టి వారి గృహాలకు ఎక్కువ నగదు ఇప్పిస్తామని,ఆశ చూపించి,వారి వద్ద నుండి నగదు వసూలు చేస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని, 5.రేఖపల్లి గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూములను గతంలో సర్వేలు చేసి ఉన్నారని,రేఖపల్లి కూడా ఆర్.అండ్.ఆర్.సర్వే చేసినారు.ఆ గ్రామాన్ని కూడా యూనిట్,గా తీసుకొని ప్యాకేజీ ఇప్పించాలని 6.వి.ఆర్.పురం గ్రామంలో సుమారు 50 గృహాలకు విలువలు కట్టలేదు.సర్వేలు చేయలేదు. వారి గృహాలు కూడా సర్వేలు చేయాలని,వై.సి.పి.మండల కమిటీ నాయకులు చింతూరు ఐ.టి.డి.ఏ.పి.ఓ.ను వినతి పత్రం ద్వారా కోరారు.

# అసంపూర్తిగా దర్శనమిస్తున్న పాఠశాల భవనం

### బిల్స్ కాక మధ్యలోనే ఆపేసిన భవన నిర్మాణం..

### భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు చదువుకునే విధంగా ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు అభ్యర్థన






**ఎటపాక ,పెన్ పవర్, జూలై 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలోని నెల్లిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదనపు గదులు మంజూరు చేశారు,ఈ అదనపు గదుల నిర్మాణానికి గత రాష్ట్ర ప్రభుత్వం నాబార్డ్ నుంచి నిధులను ఏర్పాటు చేసిందని ఆ నిధులతో భవన నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారని, గదుల నిర్మాణం పూర్తికాకుండానే మధ్యలోనే కాంట్రాక్టర్ పనులు ఆపుచేసి వెళ్లిన ఘటన నెల్లిపాక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొంది,అదనపు గదులు నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడానికి గల కారణాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకోగా, కాంట్రాక్టర్ కు నాబార్డ్ నిధుల నుంచి బిల్లులు కావడం లేదని సమాధానాన్ని తెలియజేశారు, సకాలంలో బిల్లులు అందకపోవటంతో మధ్యలోనే పనులను ఆపు చేయడం జరిగిందని అన్నారు, విద్యార్థులు శిథిలావస్థకు చేరుకున్న భవనాలలో చదువుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న గత ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణం కోసం నాబార్డ్ నుంచి నిధులు కేటాయించిందని, నిధులు సకాలంలో అందకపోవడంతో భవన నిర్మాణం పూర్తి చేయలేక పోయామని కాంట్రాక్టర్ తెలిపారు, ప్రస్తుత గవర్నమెంటు చొరవ తీసుకొని అసంపూర్తిగా నిర్మించిన పాఠశాల అదనపు గదులను వెంటనే పూర్తి చేసి పాఠశాల విద్యార్థులు చదువుకునే విధంగా చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.



## డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 22:** జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో జగ్గంపేట జనసేన ఇంచార్జ్ మరియు తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. ఈ మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ప్రారంభించి పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ మా నాయకుడు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో డొక్కా సీతమ్మ క్యాంటీన్ గత సార్వత్రిక ఎన్నికల అనంతరం నుంచి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మాదారపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరరావు, ముత్యాల వెంకటరాజు, సత్తి సోమరాజు, అంకం ఓం కృష్ణ, అడబాల వీరబాబు, డ్రిల్ మాస్టర్ శ్రీమన్నారాయణ, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చాగల్లు ఎత్తిపోతల పథకం పరిశీలన

### కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి



**చాగల్లు, పెన్ పవర్, జులై 22:** చాగల్లు ఎత్తిపోతల పథకంలో సుమా రు 1300 ఎకరాలు ఆయుకట్టు కలిగివున్నది. చాగల్లు ఎత్తిపోతల పథకం గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి మరమ్మత్తులకు నోచుకోలేని కారణంగా మోటార్లు మొత్తం నిరుపయోగంగా పనిచేయకుండా వున్నందున వర్షాకాలంలో ఆయుకట్టు నిండి పంట పొలాలు మునిగిపోయి, రైతులు ఇబ్బందులకు గురి అవుతున్నారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం చాగల్లు ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాగల్లు ఎత్తిపో తల పథకం మోటార్ల మరమ్మత్తుకు 1 కోటి 50 లక్షల రూపా యలు అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాధనలు అందించామని, గత 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులకు నిధులు కేటాయి స్తానని హామీ ఇచ్చియున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెదపల్ల సొసైటీ చైర్ పర్సన్‌గా జాస్తి బాధ్యతల స్వీకరణ



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 22:** మండలంలోని పెదపల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ నూతన చైర్ పర్సన్ గా జాస్తి భాస్కరరావుతో పాటు సభ్యులు గా మోటుపల్లి శ్రీనివాసరావు, కత్తుల రాజశేఖర్ లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వారిచేత సీఈవో సలాది సుబ్బారావు బాధ్యతలు తీసుకుంటున్నట్టు సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు, సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, సర్పంచ్ సంగీత సుభాష్, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు చౌదరి, సలాది నాగేశ్వరరావు,గారపాటి త్రిమూర్తులు,ఈదల నల్ల బాబు, వైట్ల శేషుబాబు, తదితర కూటమి నాయకులు హాజరై అభినందనలు తెలిపారు. అలాగే రైతులకు మెరుగైన సేవలు అందించాలంటూ త్రిసభ్య కమిటీని వారు కోరారు. ఈ సందర్భంగా నూతన చైర్పర్సన్ జాస్తి మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తో పాటు కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా చైర్ పర్సన్ జాస్తికి పలువురు నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన

### పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం, పెన్ పవర్, జూలై 22 : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన సాగిస్తున్నట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చినరాజప్ప గ్రామంలో పర్యటించి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు సానిపిన రామకృష్ణ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, షరతులు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆమలులోకి రానుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులపై ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్ ఛార్జి ఎలిశెట్టి నాని, పెద్దాపురం మండల అధ్యక్షుడు మొయిళ్ళ కృష్ణమూర్తి, ఏఎంసీ డైరెక్టర్ గుత్తుల సూర్యావతి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సుందరపల్లి శివ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం.. పలు కీలక సూచనలు



**ఉంగుటూరు, పెన్ పవర్ జూలై 22 :** ఉంగుటూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో కొత్తగా నియమితులైన సిబ్బందిని వేగంగా జాయిన్ చేయించడంపై చర్చించగా, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన సిబ్బందిని తక్షణమే రిలీవ్ చేయాల్సిందిగా అధికారుల నుంచి స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు. సమీక్షలో పి4 స్కీమ్ కింద బంగారు కుటుంబాలను గుర్తించి, వారిని దత్తత తీసుకునే ప్రక్రియకు మార్గదర్శకాలు రూపొందించే పనిపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి గ్రామ పంచాయతీ కూడా స్థానిక నేతల సహకారంతో ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా సూచించారు. ఇక ఉంగుటూరు శాసనసభ్యులు చేపట్టిన 'పల్లె పల్లెకు పచ్చమట్ల' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి, పంచాయతీ కార్యదర్శులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. ఇందుకు తోడు గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు నిరంతర పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలనీ, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా త్రాగునీటిలో రంగు, రుచి మారే అవకాశాలు ఉన్నందున పరిమితంగా క్లోరినేషన్ చేయాలని కార్యదర్శులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులతో పాటు డిప్యూటీ ఎంపీడీవో మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు. గ్రామీణ అభివృద్ధి, ఆరోగ్యకర వాతావరణం దిశగా తీసుకుంటున్న చర్యలకు ఈ సమీక్ష సమావేశం దిశానిర్దేశకంగా నిలిచింది.

# సీజనల్ వ్యాధులతో మంచం పడుతున్న మండపేట





### ప్రభుత్వ ఆసుపత్రిలో వసతుల లేమి
### రోగులకు మంచినీటి సదుపాయం కూడా లేని వైనం
### అధ్వానంగా టాయిలెట్స్
### మధ్యాహ్నం పథకంలో రోజు ఉప్మాయే

**మండపేట. పెన్ పవర్.జూలై 22:** నియోజకవర్గ ప్రధాన కేంద్రం మండపేటలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కరువయ్యాయి. రోగుల బాధలు, రోగుల అవసరాలు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. కనీసం మంచినీటి సదుపాయం కల్పించలేని దుస్థితిలో ఆసుపత్రి ఉందంటే ఏ స్థాయిలో సమస్యలు పట్టిపీడిస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. రోగులకు సౌకర్యాలు కల్పించడంలో వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. దీనికి తోడు రోజుకో రకంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని ఓ పక్క ఎండలు మరోపక్క వర్షాలు కురియడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరం, రొంప, దగ్గు వంటి రుగ్మతలతో పాటు ఒంటి నొప్పులతో మండపేట ప్రజలు మంచం పడుతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రించే వారు కొందరైతే, ప్రైవేటు ఆసుపత్రులను, పీఎంపీ క్లినిక్ లకు వెళ్లి వైద్యం పొందే రోగులు ఎంతో మంది ఉన్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రి వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నా, దాని ఆలనాపాలన చూసేవారు కనుచూపు మేర కనిపించడం లేదు. అభివృద్ధి కమిటీ పర్యవేక్షణ అంతంత మాత్రం గానే ఉండడంతో ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేశాయి. రోగాల బారిన పడి ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటూ ఇన్ పేషెంట్లుగా ఉన్న రోగులను సరిగా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇన్ పేషెంట్లుగా ఉన్నవారికి మూడు పూటలా ప్రభుత్వం ఆహారం అందజేయాల్సి ఉంది. అయితే ఈ ఆహారంలో నాణ్యత లోపించిందని రోగులు ఆరోపిస్తున్నారు. ఉదయం రోగులకు అందించే అల్పాహారాన్ని ప్రతిరోజు ఉప్మాతో సరిపెట్టుకుంటున్నారని అంటున్నారు. ఇది తింటుంటే కడుపు నొప్పి వచ్చి అదనంగా మరో బాధ కొనితెచ్చు కుంటున్నట్టు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. బాత్ రూమ్ డోర్లు పూర్తిగా పాడైపోయి గోడలకు వేలాడుతున్నాయి. ఇకపోతే ఈ బాత్ రూమ్ పురుషులకు స్త్రీలకు ఒకటే కావడం గమనార్హం. దీంతో మహిళలు బాత్ రూం కు వెళ్లాలంటే సిగ్గు చంపుకుని వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. మహిళల ఆత్మ గౌరవం దెబ్బతీసే విధంగా మరుగుదొడ్లు ఉన్నాయి. అత్యవసర పరిస్థితిలో ఆ బాత్ రూం లే దిక్కు అవుతున్నాయని వాపోతున్నారు. అలాగే దాతల సహకారంతో ఏర్పాటైన ఆర్వో ప్లాంటు మొరాయించింది. దీన్ని ఏ ఒక్కరూ పట్టించు కోవడం లేదు. ఆ పక్కనే ఉన్న ఫ్రీజర్ లో మంచినీళ్లు ఉన్నాయో లేదో కూడా పట్టించుకునేవారు లేకుండా పోయారు. రోగులు దాహంతో కేకలు వేస్తున్నా వీరి మొర ఆలకించే వారు కనిపించ కుండా పోయారు. పట్టణంలో ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులు ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రని బాధితు లు వాపోతున్నారు. వైద్యం కోసం రక్తపు గాయాలతో అక్కడికి వెళ్తుంటే ఆసుపత్రిలోని వైద్యులు గాని సిబ్బంది గానీ సరిగా పట్టించుకో కుండా కబుర్లు చెప్పుకుంటున్నారని అంటున్నారు. నిర్లక్ష్య సమాధానాలు ఇస్తూ రోగులను మరింత బాధ పెడుతున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గానికి ప్రధాన ఆసుపత్రిగా ఉన్న మండపేట ప్రభుత్వ ఆసుపత్రి తీరు తెన్నులు ఏమీ బాగా లేవని ప్రజలు మండి పడుతున్నారు. శారీరక రుగ్మతలతోనూ, ప్రమాదపు గాయాలతోనూ ఆసుపత్రికి వెళుతుంటే సరైన వైద్యం అందించలేక పోతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిత్యం వందల సంఖ్యలో ఆసుపత్రిని ఆశ్రయించే రోగులకు నాణ్యమై న వైద్యం అందే విధంగాను, మౌలిక వసతులు మెరుగు పరిచే విధం గాను పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు గుర్తు చేస్తున్నారు. మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో తిష్ట వేసిన సమస్యలపై ప్రజా ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

### తూతూ మంత్రంగా అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రతినెల ప్రభుత్వ ఆసుపత్రిలో క్రమం తప్పకుండా నిర్వహించే అభివృద్ధి కమిటీ సమావేశం తూతూ మంత్రంగా సాగుతోందని ప్రజల విమర్శిస్తున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో ఆసుపత్రిలోని సమస్యలను వైద్యులు గాని వైద్య సిబ్బంది గాని ఎమ్మెల్యే దృష్టికి తేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయని అంటున్నారు. మొక్కుబడిగా సమావేశం నిర్వహించి ఫలితం ఏమిటని ప్రజలు పెదవి విరిస్తున్నారు. వచ్చే అభివృద్ధి కమిటీ సమావేశానికైనా ఎమ్మెల్యే వేగుళ్ల క్షేత్రస్థాయిలో ఆసుపత్రి చుట్టూ కలియతిరిగి సమస్యలు గుర్తించాలని కోరుతున్నా రు. అనంతరం వాటి పరిష్కారానికి కృషి చేస్తే బాగుంటుందని హితవు పలికారు. ప్రతిపక్ష నేత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కూడా ఈ ఆసుపత్రిపై ఓ కన్నేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు. అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధిగా ఉన్న తోట త్రిమూర్తులు కూడా హాజరైతే ఇరువురి పర్యవేక్షణలో పరిష్కార మార్గం లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.





## ఏలేశ్వరంలో ఎమ్మెల్యే తొలి అడుగు..

### టిడిపిలో సుమారు 100 మంది చేరిక

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 22:** స్థానిక 11వ వార్డులో మంగళవారం నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో ప్రతిపాడు ఎమ్మెల్యే వరుకుల సత్య ప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు బొది రెడ్డి గోపాలకృష్ణ, మూదినారాయణ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. తొలుత దివంగత నేత బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 11వ వార్డులో అట్టహాసంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేసిన ప్రజా సంక్షేమ అభివృద్ధి పనులను ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాలను ఎమ్మెల్యే సత్యప్రభ పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పట్టణ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి,మూది నారాయణ స్వామి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ గొడత చంద్రమ్మ కుటుంబ సభ్యులు గొడత విజయ జానకి రాజబాబులతో పాటు సుమారు 100 మందికి ఎమ్మెల్యే సత్యప్రభ పార్టీ కండువాలు వేసి టిడిపిలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు,యువనేత నారా లోకేష్ ఆదేశాలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు అడుగడుగునాబ్రహ్మరథంపడుతున్నారన్నారు.



అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమనిఅన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,నియోజకవర్గ పరిశీలికులు మెట్ల రమణబాబు,ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి ( బుజ్జి), సీనియర్ నాయకుడు అలమండ చలమయ్య, బద్ది రామారావు,కౌన్సిలర్లు ఎండగుడి నాగబాబు,కోణాల వెంకటరమణ, ఎంద్ర శ్రీను,ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు వాగు రాజేష్,జొన్నాడ వీరబాబు,నాయకులు బుద్ధ సూర్యప్రకాష్,పసల సూరిబాబు,బస్వా ప్రసాద్,మైరాల కనకారావు,అనంతారపు రాజు,రుచి రమేష్,ఇళ్ల అప్పారావు, పలివెల వెంకటేశ్వరరావు, ఎస్‌జివి సుబ్బరాజు,పలివెల శ్రీనివాస్,కోరుకొండ నూకరాజు పాల్గొన్నారు.

## గ్రంధాలయాల అభివృద్ధికి తోడ్పడండి: ఎం. శేఖర్ బాబు



**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 22:** జిల్లాలోని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలు గ్రంథాలయాలకు చెల్లించవలసిన చేతులను శిష్యులను సకాలంలో చెల్లించి గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పోడూరు మండలంలోని జిన్నూరు శాఖా గ్రంధాలయాన్ని, జిన్నూరు శాఖా గ్రంధాలయానికి అనుబంధంగా ఉన్న వేడంగి, వడ్లవానిపాలెం గ్రామాల లోని పుస్తక పంపిణీ కేంద్రాలను మంగళవారం అయన ఆకస్మిక తనిఖీ జరిపారు. పుస్తక పంపిణీ కేంద్రాల రికార్డులను పరిశీలించి బీడీసీ లకు తగిన సూచనలు చేశారు. పుస్తక పంపిణీ కేంద్రం ఆవశ్యకతను తెలియజేసి పాఠకులు, విద్యార్థులు పుస్తక పంపిణీ కేంద్రానికి ఎక్కువ మంది చదువరులు వచ్చి ఉపయోగించుకునేలా చూడాలన్నారు. వేడంగి పుస్తక పంపిణీ కేంద్రం నిర్వహిస్తున్న పాత భవనం శిదిలావస్థలో ఉన్నందున అనువయిన చోటుకు మార్చాలని సూచించారు. జిన్నూరు శాఖా గ్రంథాలయంలో గ్రంధాలయ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా గ్రంధాలయ సంస్థ శాఖా గ్రంధాలయాలకు, పుస్తక పంపిణీ కేంద్రాలకు నిర్దేశించిన నెలవారీ కార్యక్రమాలను అమలు జరపాలని కార్యదర్శి శేఖర్ బాబు సూచించారు.అనంతరం అయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పంచాయతీల నుండి సుమారు 20 కోట్లు సెస్ బకాయిలు ఉన్నాయని ఏలూరు మున్సిపాలిటీలో 10 కోట్ల వరకు గ్రంధాలయ సంస్థకు సెస్ రావలసి ఉందన్నారు మిగిలిన పంచాయితీలు, మున్సిపాలిటీ ల నుండి 10 కోట్ల వరకు రావలసి ఉందన్నారు. సెస్ లు చెల్లించేలా చూడాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్ల దృష్టికి కూడా తీసుకురావడం జరిగిందని అయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధాలయాధికారి బి జోగారత్నం బీడీసీలు కె రామం, టి ఉదయభాస్కర్ సిబ్బంది ప్రసాద్ లు శేఖర్ బాబును సత్కరించారు.

## కాజులూరులో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం

### ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది: టీడీపీ మండలాధ్యక్షుడు నారాయణమూర్తి

**కాజులూరు, పెన్ పవర్,జూలై 22:** కాజులూరు మండలం కాజులూరు గ్రామంలో మంగళవారం "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, రైతు సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాజులూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు) మాట్లాడుతూ, "ప్రజలతో ప్రత్యక్షంగా కలిసిమెలిసి వారి సమస్యలు తెలుసుకోవడం, గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను సుదీర్ఘంగా చర్చించడం ఈ కార్యక్రమానికి ముఖ్య ఉద్దేశ్యం" అని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలివెల రాజు, వెలుగుబంట్ల శ్రీరామచంద్ర మూర్తి, బొడ్డు వీరకృష్ణ, కన్వీనర్లు బొండాడ వీర మణికంఠ, యాళ్ల దొరబాబు, ఏళ్ల వెంకటేశ్వరరావు, మండల రైతు సంఘం అధ్యక్షుడు సలాది నానాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించడంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలుపై అవగాహన కల్పించారు. గ్రామస్థులు కూడా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# పెళ్లి వాగ్దానం పేరిట శారీరక సంబంధం

## నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష

**పెనుమంట్ర, పెన్ పవర్, జూలై 22:** పెనుగొండ మండలంలోని వెంకటరామపురానికి చెందిన అంజూరి ప్రసన్నకుమార్‌కు 10 సంవత్సరాల కారాగార శిక్ష విధిస్తూ ఏలూరు 5వ అదనపు జిల్లా న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఎస్సై కె. గంగాధర్ రావు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అతనిపై ఫిర్యాదు దారిని పెళ్లి చేసుకుంటానని మోసపూరితంగా నమ్మించి పలుమార్లు శారీరకంగా అనుభవించాడన్న ఆరోపణలపై కేసు నమోదు కాగా, న్యాయస్థానం నేరం రుజువు చేసినది. క్రైమ్ నెంబర్ 392/2021 కింద నమోదు చేసిన ఈ కేసులో బాధితురాలు ( 25) ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు దాఖలు చేశారు. నిందితుడు అంజూరి ప్రసన్నకుమార్, తండ్రి రామకృష్ణ గ్రామానికి చెందిన చుక్కుడు తోటలో కూలిపనులకు వచ్చిన మహిళ ను పెళ్లి చేసుకుంటానని చెప్పి వలలో వేసి శారీరకంగా అనుభవించినట్టు ఫిర్యాదు ఉంది. కోర్టు నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా విధించారు. ఈ కేసులో సాక్ష్యాలు సేకరించడంలో పెనుగొండ సీఐ ఆర్. విజయ్‌కుమార్, ఎస్ఐ కె. గంగాధరరావు, హెడ్ కానిస్టేబుల్ తిమ్మరాజు, కానిస్టేబుల్ నాగబాబు పాత్ర పోషించారు. ఈ కేసులో న్యాయం సాధించడంలో విశేషంగా కృషి చేసిన అధికారులను పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఐపీఎస్ గారు అభినందించారు.



# శేరిలంకలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**కె గంగవరం పెన్ పవర్ జూలై 22:** కే గంగవరం మండలంలోని సేరిలంక మరియు గంగవరం గ్రామాల్లో మంగళవారం "పొలం పిలుస్తోంది" కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి నేతృత్వంలో చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు బి. నాగకుమార్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఖరీఫ్ - 2025 సీజన్ కోసం ప్రతి రైతు పంటభీమా తప్పనిసరిగా చేయించు కోవాలని సూచించారు. పంట నష్టాల నుండి రక్షణ పొందేందుకు ఇది ఒక విలువైన కవచంగా నిలుస్తుందని వివరించారు. ఈ సందర్భంగా గంగవరం వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు నేమాని సత్యనారాయణ మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలతో ముందుకు వస్తోందని తెలిపారు. ముఖ్యంగా "అన్నదాత సుఖీభవ %-% పీఎమ్ కిసాన్" పథకం ద్వారా ప్రతి అర్హ రైతుకి ఆర్థిక సంవత్సరానికి రూ. 20,000/- మేర ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే వ్యవసాయ విభాగం ఏవో మాట్లాడుతూ, ఖరీఫ్ - 2025 సీజన్‌కు ఈ-పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, పంట వేశాక ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో వ్యవసాయ విభాగానికి చెందిన ఏఈఓ హే మంత్, విఏఏ చంద్రశేఖర్, నవ్య, ప్రకృతి తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సకిలి



పెద్దాపురం, పెన్ పవర్, జూలై 22 : పేదరికం లేని సమాజ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్ షిప్) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సకిలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమం అమల్లో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పి4 భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పీ4 కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో 1.02 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు సంపన్న కుటుం బాలు సాయం అందించడమే పీ4 లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్ర మం ద్వారా జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి, తహసీ ల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ కె. శ్రీకాంత్ రెడ్డి, డీఈ డి.ఎస్.ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి సమీక్ష





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, జూలై 22:** ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి నగర పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై డివిజన్ల వారీగా వివరాలను సమీక్షించారు. వివిధ దశలలో ఉన్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ నేల గట్టిదనాన్ని బట్టి సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. స్లమ్ ప్రాంతాల్లో పూర్తిగా సీసీ రహదారులే ఏర్పాటు చేయాలని సూచించారు. డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన టీడీఆర్ బాండ్లను దుర్వినియోగించే పరిస్థితి తలెత్తకూడదని స్పష్టం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా 17, 18, 19వ డివిజన్లలో మేజర్ డ్రెయిన్ నిర్మాణానిన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుకు అనుగుణంగా అంచనాలు సిద్ధం చేయాలన్నారు. పుష్కర పనులలో భాగంగా చేపట్టిన రహదారులు వెడల్పు చేసే పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. నగరంలో నూతనంగా అభివృద్ధి చేసిన పార్కులను స్థానిక సొసైటీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లకు అప్పగించడం ద్వారా వాటి నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఇప్పటికే శంఖుస్థాపనలు చేసిన పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సూపరింటెండింగ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, ఈఈలు మాధవి, రీటా, మదర్సా అలీ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన పెంచుకోవాలి

## -ఏ ఓ నాగం సుధామాధురి



**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 22:** రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిని నాగం సుధామాధురి తెలియజేశారు. మంగళవారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుధా మాధురి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు, ఈ సందర్భంగా సుధామాధురి మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ప్రతి కౌలు రైతు విధిగా తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలని తెలియజేశారు. దమ్ము లో వేసుకొన వలసిన ఎరువులు ఏ మోతాదులో వేసుకోవాలో రైతులకు విపులంగా వివరించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిలో సాధించడమే కాకుండా, ఆరోగ్యవంతమైన పంటలు పండించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా రైతులకు గట్ల మీద వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, మాజీ ఎంపిటిసి బీశెట్టి సూరిబాబు, గ్రామ రెవెన్యూ అధికారి షేక్ ఇస్మాయిల్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ తోపాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మా తండ్రి ముద్రగడ ఆరోగ్యం క్షేమం

## ముద్రగడ తనయుడు వీర రాఘవరావు (బాలు)



కిర్లంపూడి, పెన్ పవర్,జూలై 22 :మా తండ్రి, మాజీ మంత్రి, రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారని ముద్రగడ తనయుడు ముద్రగడ వీర రాఘవరావు (బాలు) ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదు యశోద ఆసుపత్రిలో తమ్ముడు ముద్రగడ గిరిబాబు నాన్న వద్ద ఉండి వైద్యుల సంరక్షణలో మెరుగైన వైద్య సేవలు అందేలా చూసుకుంటున్నారని తెలిపారు. నా తండ్రి ముద్రగడను చూసేందుకు దయచేసి ఎవరూ హైదరాబాద్ వెళ్లవద్దని ముద్రగడ అభిమానులను, వైసీపీ శ్రేణులను ఒక ప్రకటనలో కోరారు. తమ్ముడు గిరిబాబుని మాత్రమే ఐసియులోకి అనుమతిస్తున్నారని, ఫోన్ కూడా లిఫ్ట్ చేయడానికి తమ్ముడుకి కుదరడం లేదన్నారు. ఎవరు అన్యధా భావించకుండా అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా బాలు విజ్ఞప్తి చేశారు. మీ అందరి అభిమానాలతో, ఆ భగవంతుని ఆశీస్సులతో నాన్న త్వరలోనే కోలుకుని ఆరోగ్యవంతంగా తిరిగి మీ ముందుకు వస్తారని,ఆయన ఆరోగ్యంపై అభిమానులు,వైసిపి శ్రేణులు ఆందోళన చెందనవసరం లేదని ముద్రగడ బాలు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నం



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 22:** వృద్ధ దంపతులు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన మంగళవారం జగ్గంపేటలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలం ఏవి నగరంకు చెందిన సక్కుల సత్యనారాయణ, మంగతాయారు దంపతులు పెద్దాపురం శ్రీ చక్ర హాస్పిటల్ లో వాచ్మెన్ గా పనిచేస్తున్నారు. వృద్ధ దంపతులను వారి పిల్లలు పట్టించుకోవట్లేదని జీవితంపై విరక్తి చెంది జగ్గంపేట శివారు సీతానగరం రోడ్డు జంక్షన్ లో ఉన్న గుడి సమీపంలో పాయిజన్ తాగి అక్కడే ఉన్న చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గమనించిన స్థానికులు వారిని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందజేశారు. వారిని ముందు జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి..

## మరొకరికి తీవ్ర గాయాలు



**ఆలమూరు, పెన్ పవర్, జూలై 22:** 216 ఏ జాతీయ రహదారిపై మండలంలోని మడికి అంతర రాష్ట్ర కూరగాయల మార్కెట్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం%ౌ% అమలాపురం రూరల్ ముక్కామల శివారు ఇరుసుమండకి చెందిన వెంపల చంద్రశేఖర్ (50) ఐచర్ వ్యాన్ పై డ్రైవర్ గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాన్ ను నడుపుకుంటూ కొత్తపేట నుండి రాజమహేంద్రవరం వెళ్తున్నాడు. ఇంతలో రావులపాలెం వద్ద బిక్కవోలు మండలంలోని ఊలపల్లికి చెందిన వాస వెంకట మురళి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ వరకు వ్యాన్ ను ఆపి లిఫ్ట్ అడిగి తనతో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాన్ మడికి కూరగాయల మార్కెట్ సమీపానికి వచ్చేసరికి సాంకేతిక లోపంతో ఆగి ఉన్న లారీని వెనుక భాగంలో బలంగా ఢకొరెది. ఈ ఘటనలో డ్రైవర్ చంద్రశేఖర్ అక్కడికక్కడే మఅతి చెందాడు. అదే వాహనంలో ప్రయాణిస్తూ వాహనంలో ఇరుక్కుపోయిన వెంకట మురళిను పోలీస్ సిబ్బంది, హైవే సిబ్బంది కలిసి ప్రోక్లైన్ సహకారంతో సుమారు రెండు గంటలపాటు శ్రమించి వెలికి తీశారు. దీంతో తీవ్ర గాయాలైన మురళిని హుటాహుటీనా అంబులెన్స్ లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.నరేష్ తెలిపారు.



# ఆదర్శనేత విఎస్ అచ్యుతానందన్‌కు ఘన నివాళి

## కమ్యూనిస్టు యోధుడికి సిపిఎం నేతల నుంచి నివాళులు



**చింతూరు, పెన్ పవర్, జులై 22:** కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు ఉద్యమ పితామహుడు వివిఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సిపిఎం పార్టీ ఘన నివాళులు అర్పించింది. చింతూరు సిపిఎం పార్టీ కార్యాలయంలో అమరజీవి అచ్యుతానందన్ చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ, యువ వయసులో కార్మిక సమస్యలపై పోరాటాలతో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన అచ్యుతానందన్, సాధారణ కుటుంబం నుంచి సీఎం పదవిని చేపట్టిన మేధావి నేత. ఎనిమిది దశాబ్దాలుగా రాజకీయాల్లో మచ్చలేని జీవితం గడిపిన ఆయన, కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకుడిగా నిలిచారు, అని పేర్కొన్నారు. అలాగే, దేశ రాజకీయాల్లో అవినీతి, కుతంత్రాలు పెరిగిపోతున్న కాలంలో అచ్యుతానందన్ వంటి ఆదర్శనేతలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే వారని కొనియాడారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి అమోఘమని, కమ్యూనిస్టు ఆలోచనలకు జీవన స్ఫూర్తిగా నిలిచిన నాయకుడని తెలిపారు. ఈ నివాళి కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, పల్లపు రాములు, జల్లి నాగేశ్వరరావు, రాజు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎంగా సత్తిబాబు బాధ్యతలు స్వీకరణ



**ఆలమూరు, పెన్ పవర్,జులై 22:** మండల మహిళా సమాఖ్య ఏపిఎం గా వి.సత్తిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఏపిఎం గా విధులు నిర్వహిస్తున్న ఎం.ధనరాజు కొత్తపేట మండలానికి బదిలీపై వెళ్లారు. మండపేట మండలంలోని ఏడిద క్లస్టర్లో సీసీగా విధులు నిర్వహిస్తూ సత్తిబాబు ఇక్కడకు ఏపీఎంగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల మహిళ సమాఖ్య ద్వారా మహిళల ఆర్థిక పురోభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. ఆయన వెంట అకౌంటెంట్ కుమార్ ఉన్నారు.

## హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని పూజలు

**: మాజీ ఎంపీపీ వరుపుల తమ్మయ్య బాబు.**




**ఏలేశ్వరం, పెన్ పవర్, జులై 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం విజయవంతం కావాలని ఏలేశ్వరం మాజీ ఎంపీపీ వరుపుల తమ్మయ్య బాబు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని లింగంపర్తి గ్రామంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న జనసైనికులు వరుపుల తమ్మయ్య బాబు ఇంటి వద్ద జనసేన పార్టీ కార్యాలయం నుండి హర హర వీరమల్లు చిత్రం ఫ్లెక్స్ తో ఊరేగింపుగా లింగంపర్తి మెయిన్ సెంటర్లో అభయ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినిమా హీరో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పాన్ ఇండియా మూవీ హరిహర వీరమల్లు చిత్రం ఘన విజయం సాధించాలని నియోజకవర్గ జనసైనికులు ,వరుపుల తమ్మయ్య బాబు పూజలు నిర్వహించారు. నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన జనసైనికులతో కలసి లింగంపర్తి లో భారీగా ఊరేగింపు నిర్వహించి అనంతరం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మయ్య బాబు మాట్లాడుతూ సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో కూడా తనకంటూ మార్క్ సంపాదించుకొని తనకు వచ్చిన ప్రతి పైసా పేద ప్రజల అభ్యున్నతికి ఖర్చు చేయడంలో పవన్ కళ్యాణ్ ని మించిన నాయకుడు లేడు అన్నారు. ఆయన రాజకీయాలలోకి రాకముందు నుండి సినిమాలలో వచ్చే ప్రతి పైసా ప్రజలకు సాయం చేయడంతో పాటు డిప్యూటీ సీఎం అయిన మరుక్షణ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు అభ్యున్నతి వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. సినిమా విడుదలకు సంబంధించి పవన్ ఫ్యాన్స్ తెలుగు సినీ ప్రేక్షకులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనసైనికులు పాల్గొన్నారు.

## శాకంబరిగా కలవచర్ల శ్రీ వాకులాంబ, శ్రీ పోలేరమ్మ అమ్మ వార్లు



**ఆలమూరు, పెన్ పవర్, జులై 22:** ఆలమూరు మండలంలోని కలవచర్ల గ్రామంలో వెంచేసియన్న గ్రామదేవతలు శ్రీ వాకులాంబ,శ్రీ పోలేరమ్మ అమ్మవార్లు మంగళవారం నాడు శాకంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని, ఆలయాన్ని కమిటీ వారు అలంకరించారు. పూర్వం మునుల ప్రార్థనతో కరువు కాటకాల నివారణ కోసం పరదేవత శతాక్షిగా, శాకంబరిగా అవతరించి లోకంలోని జీవులందరికీ శాకములు, అన్న పానీయాలు అందించి పోషించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ ఆషాడ మాసంలో గ్రామదేవత అమ్మవార్లను శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీ. కలవచర్ల గ్రామదేవతలు శ్రీ వాకులాంబ, శ్రీ పోలేరమ్మ శాకంబరిగా దర్శనం ఇవ్వడం ఇదే మొదటిసారి. దానితో కమిటీ వారు అద్భుతమైన ఏర్పాట్లు చేశారు. చలిమిడి, పానకాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఈ స్వప్న కుమారి



**అడ్డతీగల, పెన్ పవర్ ,జులై 22:** బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడ్డతీగల మండలానికి చెందిన ఈ.స్వప్న కుమారి కి బిజెపి అవకాశాన్ని కల్పించింది .సోమవారం రాత్రి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆదేశాల అందినట్టు స్వప్న కుమారి తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన బిజెపి అధిష్టానానికి జిల్లా నాయకులకు ప్రతి మండల కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. తాను అహర్నిశలు కష్టపడి అధిష్టానం తనపై ఉంచిన బాధ్యతలను నెరవేరుస్తానని స్వప్న కుమారి తెలిపారు.

# చొప్పెల్ల సొసైటీ చైర్ పర్సన్‌గా నాగిరెడ్డి బాధ్యతల స్వీకరణ

**ఆలమూరు, పెన్ పవర్, జులై 22:** మండలంలోని చొప్పెల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ నూతన చైర్ పర్సన్ గా నాగిరెడ్డి వెంకటేశ్వరరావు(బాస్)తో పాటు సభ్యులుగా నాగిరెడ్డి స్వామి, పంపన సురేష్ లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వారిచేత సీఈవో నాగిరెడ్డి రాజు బాధ్యతలు తీసుకుంటున్నట్టు సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి, మాజీ డిసి చైర్మన్ నాగిరెడ్డి వెంకటరత్నం, ఎంపీటీసీ తమ్మన భాస్కరరావు, చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాసరావు చౌదరి, జనసేన మండల అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, పాలూరి సత్యానందం, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, సలాది జెపి, దంగేటి భాపనయ్య, కొత్తపల్లి రాంబాబు, పాలూరి అర్జున్, తదితర కూటమి నాయకులు హాజరై అభినందనలు తెలిపారు. అలాగే రైతులకు మెరుగైన సేవలు అందించాలంటూ త్రిసభ్య కమిటీని వారు కోరారు. ఈ సందర్భంగా నూతన చైర్పర్సన్ నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకి, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ తో పాటు కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ముందుగా చైర్ పర్సన్ నాగిరెడ్డి కు పలువురు నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.



# పాలకొల్లు నకిలీ మద్యం కేసులో కీలక మలుపు

## స్పిరిట్ సరఫరాదారు అరెస్ట్

**పాలకొల్లు, జులై 22:** పాలకొల్లులో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో కీలక అభివృద్ధి చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి స్పిరిట్ సరఫరాదారుడైన హైదరాబాద్‌కు చెందిన కృష్ణా ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ జి. మల్లికార్జున రావును అధికారులు అరెస్ట్ చేశారు. ఈ చర్యను ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ (ఏలూరు), అసిస్టెంట్ కమిషనర్ (ఏలూరు), మరియు జిల్లా ప్రొహిబిషన్ %ు% ఎక్సైజ్ అధికారి (భీమవరం) ఆధ్వర్యంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్టు పాలకొల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ వెల్లడించారు. నకిలీ మద్యం తయారీకి వినియోగిస్తున్న స్పిరిట్‌కు సరఫరా చేసినందుకు గాను మల్లికార్జున రావుపై కేసు నమోదు చేశారు. కేసు సంబంధించి మరిన్ని ఆధారాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



# విద్యుత్తు భారాలు వినియోగదారులపై వద్దు

## సి.పి.ఎం.మండల కమిటీ నాయకులు




**వి.ఆర్.పురంపెన్.పవర్.జులై.22:** స్మార్ట్ మీటర్ వద్దు విద్యుత్తు వినియోగదారులపై విపరీతమైన బారాలు మోపితే చూస్తూ ఊరుకోమని సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో సి.పి.యం మండల కార్యదర్శి పులి.సంతోష్ కుమార్, మాట్లాడారు.కేరళ రాష్ట్రంలో సీపీఎం పార్టీని ముందుగా ఉండి నడిపించిన,మాజీ ముఖ్యమంత్రి పార్టీ సీనియర్ నాయకులు అమర జీవి కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్ కు పార్టీ నాయకులు,కార్యకర్తలు నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.అనంతరం మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద పూనెం ప్రదీప్ కుమార్ అధ్యక్షతనలో జరిగిన సదస్సులో సిపిఎం మండల కార్యదర్శి పులి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయవద్దని స్మార్ట్ మీటర్లు వస్తే, విద్యుత్ భారాలు మరింత పెరుగుతాయని,ఒక్కొక్క స్మార్ట్ మీటర్ ఏర్పాటుకు తొమిది వేలు ఖర్చు అవుతుందని,ఈ నగదును ప్రతి నెల వినియోగదారుల నుండి వసూలు చేస్తారని,అన్నారు.విద్యుత్తు భారాలు వినియోగదారుల పై పడకుండా ప్రజలందరూ కలసి కట్టుగా ఉండి వ్యతిరే కించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం.పి.పి కారం లక్ష్మి,మండల కార్యవర్గ సభ్యులు పంకు సత్తిబాబు,కారం సుందరయ్య,నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, తోడం రాజు,వడ్లాది రమేష్,కదల కొండారెడ్డి,తుర్రం బాబురావు, కారం సత్తిబాబు,గుండెపూడి లక్ష్మణరావు, సీరపు తాతబాబు,పులి,బోజ్జి, ఆత్మకూరి కాంతారావు, సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య,గొంది. దారయ్య,పూసం సత్తిబాబు,సుబ్బారావు,ఖాదర్,ప్రకాష్, హాజరత్,ఉయిక దుర్గారావు,సుమన్, తదితరులు పాల్గొన్నారు.

# సంజీవనగర్‌లో మత్తు వ్యసనాలపై చైతన్యం

## జడ్డంగి ఎస్సై చిన్నబాబు

**రాజవొమ్మంగి పెన్ పవర్ జులై 22:** సంజీవనగర్ గ్రామంలో పోలీసు అధికారి చిన్నబాబు ప్రజలకు గంజాయి వినియోగం, రవాణా, తయారీ వంటి అక్రమ కృషలపై హెచ్చరికలు జారీ చేశారు. మత్తు పదార్థాల వల్ల ఆరోగ్య హానితో పాటు కుటుంబ జీవితాలు నాశనమవుతున్నాయని గ్రామస్తులకు వివరించారు.బాల్యవివాహాలు చట్టవిరుద్ధమని, చిన్న వయస్సులో వివాహం జరిపితే పిల్లల భవిష్యత్తు మసకబారుతుందని తల్లిదండ్రులకు సూచించారు. విద్యుత్ తీగలు పొలాల్లో వేసే పని ప్రాణాలకు ముప్పుగా మారుతుందని, ఉపాధి మోసాల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పారు.ప్రజలు ఎటువంటి సమస్య ఎదురైనా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని చిన్నబాబు కోరారు.ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ



చట్టాన్ని అవమానించే వారు ఎంతటి వారైనా సహించం. మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే మౌనంగా ఉండకండి. ప్రతి ఒక్కరూ మంచి కోసం మాట్లాడాలి. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలంటే మీరు చూపే బాధ్యత చాలా ముఖ్యం అని పేర్కొన్నారు.

# కైకరం గ్రామంలో ఆషాఢ మంగళవారం

## ఘనంగా సారే సమర్పణ మహోత్సవం

**ఉంగుటూరు పెన్ పవర్ జులై 22 :** ఆషాఢ మాసం సందర్భంగా కైకరం గ్రామంలో జరిగిన చివరి మంగళవారం వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా సాగాయి. గ్రామంలోని పడమర వీధిలో ఉన్న శ్రీ దుర్గా భవాని ఆలయం, తూర్పు వీధిలోని శ్రీ చిన్న కం బాలమ్మ, శ్రీ వరక కనకదుర్గాదేవి, గ్రామదేవత శ్రీ కంబాలమ్మ, శ్రీ వెంకమ్మ, నాగమణి అమ్మ తల్లి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, వందలాదిగా ఆడపడుచులు పాల్గొన్నారు. భక్తులు ఊరేగింపుగా బయలుదేరి, ప్రతి దేవాలయానికి వెళ్లి అమ్మవార్లకు చీరాసారెలు సమర్పించి అమ్మవారి కృప కోసం పూజలు చేశారు. చివరగా శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ పార్వతి అమ్మవారికి ఘనంగా సారీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీ చంద్రశేఖర్ ఆజాద్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. అంతేకాకుండా, భక్తులు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద కూడా అమ్మవార్లకు చీరాసారెలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మేళతాళాలతో, బాణసంచాలతో ఊరంతా ఉత్సవ వాతావరణాన్ని తలపించింది. గ్రామస్తుల ఐక్యతతో, భక్తిపూరితంగా నిర్వాహించిన ఈ వేడుకలు అందరి మనసుల్ని హత్తుకున్నాయి.



## మంజేరు లాకులవద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**లో వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం**

**- మంత్రి సుభాష్ చొరవ పట్ల హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు**



**కాజులూరు, పెన్‌పవర్, జులై 22:** కాజులూరు మండల పరిధిలోని మంజేరు గ్రామ ప్రజలు గత ఏడాదిన్నర కాలంగా ఎదుర్కొంటున్న లో వోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామస్తుల ఆందోళనపై సానుభూతి వ్యక్తం చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకోవడంతో, గ్రామానికి అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం జరిగింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజేరు గ్రామాన్ని సందర్శించిన వాసంశెట్టి సత్యం అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు.గ్రామ ప్రజలు విద్యుత్ లో వోల్టేజీ కారణంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు, గ్రామ సమస్యకు సమాధానం లభించడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్ర మంలో ఎంపీటీసీ గండి మణికంఠ శ్రీనివాస్, టీడీపీ నాయకులు దడాల నాగార్జున, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు యర్రంనీడి గోవిందు, పుణ్యమంతుల రామకృష్ణ, పుణ్యమంతుల తాతారావు, లైన్‌మెన్ మణికంఠ, పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కూటమి నాయకులు కూడా ఈ కార్యక్రమానికి హాజరై ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలందిస్తున్న ప్రభుత్వం పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు.గ్రామస్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి సుభాష్, ఆయన తండ్రి సత్యంలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.